# గతాన్ని తవ్వకు

**భార్య వేసిన ప్రశ్నకి భాస్కర్ ముఖం ముడుచుకుంది. ఊరి నుంచి తెచ్చుకున్న ఉత్సాహమంతా ఉఫ్ అని ఊదినట్లు ఆరిపోయింది.**

అతను సాధించానన్న విజయాన్ని గడ్డిపోచ కింద తీసిపారేసినట్లయింది. తన ఉద్యోగపు పునాదుల్నే కదిలించి వేసినట్లనిపించిందతనికి.

అగస్త్యుడు నిజంగానే వింధ్య పర్వతాలను దాటాడనడానికీ, దాటే ముందు వరకూ వింధ్యపర్వతాల ఎత్తు చాలా ఎక్కువగా ఉండేదన్న ఆ పురాణ కథ వాస్తవమని చెప్పడానికి నిదర్శనాలు వున్నాయనీ, వింధ్య పర్వత ప్రాంతాల్లో ఈసారి తవ్వకాల వల్ల తేలిందని కొండంత ఉత్సాహంతో వచ్చాడు ఇంటికి. తన పేరు భారత పురావస్తు శాఖ చరిత్రలో శిలాక్షరాలై నిలిచిపోతుందన్నంత విజయగర్వంతో వచ్చాడతను!.

అంతా విన్నాక, "ఈ తవ్వకాల వల్లా, ఈ రుజువుల వల్లా ఏమిటి లాభం? గతాన్ని తవ్వితే ఏమిటి ప్రయోజనం" అని అడిగింది సృజన. భాస్కర్ నిరుత్సాహపడి ముఖం ముడుచుకుని, సమాధానం చెప్పకుండా ఊరుకున్నాడు.

'అలా అడగటంలో తన ఉద్దేశం ఏమిటి?.... ఏమిటో, ఎందుకో నేనే అడగాలా? తనే చెప్పొచ్చుగా?..' ఇలా ఆలోచించుకుంటూనే నిరాసక్తంగా అన్నం తింటున్నాడు.

తన ప్రశ్నకి సమాధానం రాకపోవడంతో, మళ్లీ రెట్టించకుండా, అంతకన్నా నిర్లిప్తంగా కంచంలోంచి యాంత్రికంగా తీసుకుతింటోంది సృజన. శేషు రాసిన ఉత్తరం కంట్లో నలకలా ఇబ్బంది పెడుతోంది నిన్నటి నుంచి. వర్తమానాన్ని కెలికి గతాన్ని వెలికి తీయడానికి ప్రయత్నిస్తోంది. ఆ బాధతోనే అడిగింది భర్తని - "గతాన్ని తవ్వితే ఏమిటి ప్రయోజనం?" అని.

మనిషి వర్తమానంలో బ్రతుకుతాడు. భవిష్యత్తులోకి దృష్టిని సారిస్తాడు. వెనక్కి అప్పుడప్పుడు తిరిగి చూసుకోవచ్చు ఎంత దూరం, ఎలా గమనించినదీ తెలుసుకునేందుకు.

కానీ, వెనక వేసిన అడుగుల జాడల్ని తవ్వుకుంటూపోతే ముందడుగు పడుతుందా? మళ్లీ వెనక్కి వెళ్లడం సాధ్యమా జీవన మార్గంలో? - ఇదీ సృజనని ఆ ఉత్తరం వచ్చినప్పటి నుంచీ వేధిస్తున్న సమస్య.

సృజన కాలేజీలో చేరిన సంవత్సరంలోనే శేషుతో పరిచయం అయింది. శేషు జూనియర్ లెక్చరర్‌గా చేరాడు అదే సంవత్సరం అదే కాలేజీలో. అతని పాఠం వినడం కన్నా అతని ముఖం కేసే చూస్తూ, అతని హావభావాల్ని గమనిస్తూ కూర్చునేది క్లాసులో. అది గ్రహించడానికి ఎంతో కాలం పట్టలేదు శేషుకి. ఓ రోజు కాలేజీ నుంచి తిరిగి వెళ్లేటప్పుడు ఒక్కర్తీ వెళ్తూంటే దారి కాసి పట్టుకుని పరిచయం పెంచుకున్నాడు.

ఆమె స్వవిషయాలు అడిగి తెలుసుకున్నాడు. తన గురించి చెప్పాడు. కులభేదాలూ, ఆర్థిక వ్యత్యాసాలూ వారి స్నేహానికి అడ్డురాలేదు. శేషు 'తక్కువ' కులంవాడైనా, ఎక్కువ డబ్బున్న కుటుంబంలో పుట్టినవాడు. సృజన 'పై' కులానికీ, మధ్య తరగతిలో కింది స్థాయికీ చెందినది. యుక్త వయస్సు ఇద్దరినీ మానసికంగా సన్నిహితం చేసింది. ఒకరి 'అంద' చందాలు మరొకరి దృష్టిలో ద్విగుణీకృతమై, పరస్పర ఆకర్షణని పెంచాయి. సృజన తన చదువు కోసమూ, శేషు అందరికీ చదువు చెప్పడం కోసమూ కాక, ఇద్దరూ ఒకరి కోసం ఒకరు కాలేజీకి వెళ్తున్నట్టుగా వుండేది. ఒకరు రాకపోయేసరికి మరొకరికి దిగులు. ఆ రోజంతా వ్యర్థమైన భావన. ఇద్దరూ క్లాసులయాక చాటుగా ఎక్కడో ఒక చోట కలుసుకుని కబుర్లు చెప్పుకునేవారు. ఇంటికి ఆలస్యంగా వెళ్లినప్పుడల్లా ఏవో కారణాలు కల్పించి చెప్పుకునేది సృజన. అతనికా అవసరం లేదు మగవాడు కాబట్టి.

సృజన ఇంటర్ పూర్తిచెయ్యగానే బి.ఎ.లో చేర్పించకుండా, టైపింగ్ కోర్సులో చేర్పించాడు తండ్రి - ఉద్యోగం వస్తే కట్నం ఇవ్వడానికి ఉపయోగపడుతుందనీ, లేదా సంబంధం సులభంగా కుదురుతుందనీనూ.

శేషు సృజనని అప్పుడప్పుడు ఎలాగో కలుసుకుంటూనే వున్నాడు. తన ప్రేమని ప్రకటిస్తూనే వున్నాడు. సృజనకి ఉద్యోగం వస్తే కొంత ఆత్మవిశ్వాసం పెరుగుతుందనీ, అప్పుడు తనని చేసుకోవడానికి కొంత ధైర్యం వస్తుందనీ అతను ఆశించాడు. అదే ఆశాభావాన్ని సృజనకి నూరిపోసేవాడు.

సృజన విధిని నమ్ముకుంది. ఎలా జరగాలనుకుంటే అలా జరుగుతుంది. వర్తమాన పరిస్థితుల్తో రాజీపడటం తప్పదు అన్నట్లుగా ఇటు తల్లిదండ్రుల మాటని కాదనడం లేదు, అటు శేషునీ కాదనడం లేదు!

శేషుకి రీసెర్చ్ చెయ్యడానికి ఒక అమెరికన్ యూనివర్సిటీలో సీటొచ్చింది. అమెరికా వెళ్లే

ముందు సృజనని కలుసుకుని, ఎన్నాళ్లయినా తన కోసం ఆగమని అర్థించాడు. అమెరికాలో తనకి సుస్థిరత లభించగానే వచ్చి, ఆమెని పెళ్ళి చేసుకుని తనతో తీసుకువెళ్తానని మాటిచ్చాడు.

శేషు వెళ్లిన నెల్లాళ్లకి ఒక ఉత్తరం వచ్చింది సృజనకి - టైపు ఇన్స్టిట్యూట్ అడ్రసుకి. అక్కడి కొచ్చిన ఉత్తరం చూసి తెల్లబోయింది. మేనేజర్ ఏమనుకుంటాడోనని సంశయించింది. మళ్లీ ఆలోచించగా, ఇదే నయమనిపించింది. ఇంటికి రాస్తే తల్లిదండ్రులు ఆరాలు తీసేవారు. ఉత్తరంలో తన అమెరికా అనుభవాల గురించి రాస్తూ, అక్కడి ఒంటరితనం ఎంత బాధగా వుందో వర్ణించి, సృజన తన సన్నిధిలో వున్నట్లు ఊహించుకుని తృప్తిపడుతున్నానని రాశాడు. సృజన దగ్గర నుంచి జవాబు వచ్చేవరకూ మనశ్శాంతి వుండదనీ, జవాబు కోసం వెయ్యికళ్లతో ఎదురు చూస్తూ వుంటాననీ రాశాడు.

సృజన జవాబు రాయకుండా వుండలేకపోయింది. అలా కొన్ని నెలలు ఇద్దరి మధ్యా ఉత్తరప్రత్యుత్తరాలు నడిచాయి.

సృజనకి పురావస్తు శాఖలో ఒక 'లీవ్ వేకెన్సీ'లో తాత్కాలికంగా ఉద్యోగం వచ్చింది. అదే శాఖలో పని చేస్తున్న అసిస్టెంట్ ఆర్కియాలజిస్ట్ భాస్కర్‌తో సంబంధం నిశ్చయించాడు సృజన తండ్రి. ఇది రెండవ పెళ్లి సంబంధం. భాస్కర్ భార్య పోయి సంవత్సరం దాటింది. నాలుగేళ్ల పిల్ల వుంది. కట్నం ఇవ్వక్కర్లేకుండా 'మంచి' సంబంధం కుదిరిందని సృజన తండ్రి సంతోషించాడు. ఆ సంగతితెలియజేస్తూ, తన నిస్సహాయ స్థితిని వివరిస్తూ క్షమించమని అర్థిస్తూ, మంచి స్నేహితులుగా వుండిపోదామని సూచిస్తూ ఉత్తరం రాసింది శేషుకి.

భర్త టూరుకి వెళ్లిన సమయంలో ఇంట్లో ఊరికే కూర్చుంటే ఏమీ తోచక, శేషుకి ఉత్తరం రాసింది - తన యోగక్షేమాలు తెలియజేస్తూ, అతని యోగక్షేమాలు తెలియజేయమని కోరుతూ. అదే పొరపాటయిపోయింది.

భర్త టూర్ నుంచి తిరిగి రావడంతో సృజన మళ్లీ శేషుకి ఉత్తరం రాయలేదు. తరవాత కొన్నాళ్లకి కూతుర్ని తీసుకొచ్చి తమ దగ్గరే వుంచుకోవడం వల్ల ఆ పిల్ల ఆలనా పాలనతో అసలు తీరిక చిక్కేది కాదు.

ఒక ఏడాది గడిచింది. అప్పుడిక సృజనకి నెల తప్పడం, వేవిళ్లూ, సీమంతం, పురిటికి వెళ్లడం, తరవాత పసిపిల్లాణ్ణి చూసుకోవడం - వీటన్నిటితో ఆ సంగతి పట్టించుకోలేదు. కానీ, కొడుకు మొదటి పుట్టిన రోజు వస్తుందనగా మాత్రం కొడుకు పుట్టినట్లూ 'విశేష్' అని పేరు పెట్టినట్లూ ఉత్తరం రాసింది శేషుకి. శేషు ముక్తసరిగా ఉత్తరం రాశాడు -రీసెర్చ్ అయిపోవచ్చిందనీ, కానీ, ఇండియా వస్తే మళ్లీ 'వీసా' దొరుకుతుందో లేదోనని అనుమానంగా

వుందనీ, అక్కడే ఉద్యోగం చూసుకుని గ్రీన్ కార్డ్ సంపాదించాకే స్వదేశానికి రాగలనని రాశాడు. సృజనని ఇప్పట్లో చూడలేనందుకు చాలా బాధగా వుందని రాశాడు. అంతేగాని ఆమె భర్త గురించి గాని, కొడుకు గురించిగాని ఏం ప్రస్తావించలేదు. సృజన చాలా చిన్నబుచ్చుకుంది. అతని పని హడావిడిలో సరిగ్గా రాయలేదేమోనని మళ్లీ సరిపెట్టుకుంది.

సృజన తండ్రి పోయాడని కబురుతెలిసి చూడటానికి వెళ్లారు అంతా. తండ్రి పోయాడన్న దుఃఖంలో తన ఆత్మీయుడుగా భావిస్తున్న శేషుకి ఉత్తరం రాయాలనిపించింది. తండ్రి మరణం గురించి రాసి, శేషు ఆరోగ్యం ఎలా వుందనీ, భోజన సదుపాయాలు సరిగ్గా వున్నాయా అనీ ఆప్యాయంగా అడిగింది ఉత్తరంలో. శేషు దగ్గర నుంచి జవాబు వచ్చింది చాల రోజులకి. ఉద్యోగంలో చేరినట్లూ, చాలా బిజీగా వున్నట్లూ, 'వీకెండ్స్'లో - ఇండియాలో తాము కలిసి గడిపిన రోజులు గుర్తుకొచ్చి ఒంటరితనం మరింత బాధిస్తోందనీ, వీలైనంత త్వరలో ఇండియా రావడానికి సర్వప్రయత్నాలూ చేస్తున్నట్లూ రాశాడు. సృజన తండ్రి మరణం పట్ల సంతాపాన్ని వ్యక్తం చెయ్యడంగాని, సృజన సంసారం పట్ల కుతూహలం ప్రదర్శించడం గాని ఏమీ లేదు ఉత్తరంలో. తన భర్త గురించిగానీ, పిల్లల గురించి గానీ ప్రస్తావించకపోవడంతో కోపం వచ్చి, ఉత్తరాన్ని ముక్కలు ముక్కలుగా చింపేసింది సృజన. ఇంక చచ్చినా అతనికి ఉత్తరాలు రాయకూడదని నిర్ణయించుకుంది. రాయలేదు మళ్లీ.

ఇన్నేళ్ల తరవాత, మళ్లీ ఇప్పుడు ఉత్తరం వచ్చింది శేషు దగ్గరి నుంచి - "నా మాట మీద నేను నిలబడ్డాను. ఇన్నాళ్లూ పెళ్లి చేసుకోకుండా వున్నది నీకోసమే. వచ్చే జూన్‌లో అక్కడికి వస్తున్నాను. ఏన్నాళ్లయినా, ఏనాటికయినా నువ్వు నా దానివని ఆ నాడే చెప్పాను. ఇప్పుడూ అదే మాటమీదున్నాను. నువ్వు సిద్ధంగా వుంటావని నమ్ముతున్నాను.." అంటూ రాశాడు.

ఉత్తరం చదువుతూంటే సృజన గుండె వేగంగా కొట్టుకుంది. భయంగా ఇటూ అటూ చూసింది చుట్టుపక్కల ఎవరూ లేకపోయినా. భర్త టూర్లో వున్నాడు. పిల్లలిద్దరూ స్కూలుకి వెళ్లారు. హఠాత్తుగా మిన్ను విరిగి మీద పడినట్లుగా తోచింది సృజనకి. ఆలోచిస్తే మతిపోతుందేమోననిపించింది.ఆలోచించకుండా వుండలేకపోయింది. కోపం పట్టలేకపోతోంది - 'నా ఉత్తరాలు అందుకున్నవాడికి నా ప్రస్తుత స్థితి తెలియదా? పెళ్లయిందనీ, పిల్లల తల్లి అని తెలిసీ ఇలా రాయడంలో అర్థమేమిటి? ప్రశాంతంగా సాగుతున్న నా సంసారంలో కలతలు రేపి, నా కాపురాన్ని నాశనం చెయ్యడానికా? ఎప్పుడో యుక్తవయసులో ఎదిగీ ఎదగని మనసులో ప్రేమభావం అంకురిస్తే అంకురించవచ్చునుగాక. దాన్ని నేనెప్పుడో నా జీవితంలోంచి తొలగించాను. దాని స్థానంలో మరో మొక్క వేస్తే అది వృక్షమయింది ఈనాడు. దాన్ని కూకటి వేళ్లతో పెళ్లగించడం న్యాయమా? ఆ మొక్కని నేను నాటకపోయినా, దానికి నీరూ, ఎరువూ నేనే అయి పాటుపడ్డాను. చివరికి అందులో భాగమైపోయాను. ఆ

వృక్షం వేరూ నేను వేరూ కాదు. ఇప్పుడు నా శక్తి యావత్తూ ఆ వృక్షానికే అంకితమైపోయింది - అందులో లీనమైపోయింది. ఇలా ఎదిగిన వృక్షంలోంచి నన్ను విడదీయడం సాధ్యమా? నన్ను విడదీయడానికి వృక్షాన్నే కూలుస్తాడా?! నా కొమ్మల్నీ, వేళ్లనీ నరికి నన్ను విడిగా తీసుకుపోతాడా?! ఏమిటీ వైపరీత్యం? ఏమిటీ అన్యాయం? ఎందుకిలాంటి ఉత్తరం రాయడం? ప్రేమ అంటే ప్రేమించిన వారికి హాని తలపెట్టడమా?....' రాత్రంతా ఇలాంటి ఆలోచనతో జాగారం చేసింది సృజన. పిల్లల్ని ఆబగా దగ్గరకి తీసుకున్నా, హత్తుకుని పడుకున్నా మనస్సు కుదుటపడలేదు. 'ఉత్తరమే ఇంత అలజడి రేపుతోంది. రేపు అతను నిజంగా వచ్చి, ఇంట్లోకి చొచ్చుకొచ్చి నిలదీస్తే నా పనేమవుతుంది? ఏదైనా కానిపనికి పూనుకుంటే నా గతేం కాను?... నా ప్రస్తుత వివాహ సౌధాన్ని కూలగొట్టి, దాని మీద ఆనాటి ప్రేమతో మరో మందిరాన్ని నిర్మిస్తాడా?! ఇది సబబేనా? ప్రేమలో పడిన మనస్సు మంచీ చెడూ చూడలేనంత గుడ్డిదవుతుందా? లేక, మగవాడికి మొండితనం, పట్టుదలా ఎక్కువా?.. గతాన్ని తవ్వితే ఏమిటి ప్రయోజనం?... ప్రస్తుతాన్ని నాశనం చెయ్యడానికి తప్ప..!

ఇదే ప్రశ్న వేసుకుంటోంది మనస్సులో నిన్నటి నుంచి. ఊరి నుంచి రాగానే భర్త గతాన్ని తవ్వి నిజాన్ని రుజువు చేస్తానని సగర్వంగా చెబుతూంటే, సృజనకి భర్త సాధించిన విజయానికి సంతోషం కలగలేదు, పైగా ఒళ్లు మండిపోయింది. "గతాన్ని తవ్వితే ఏమిటి ప్రయోజనం?..." అని ప్రశ్నించింది.

తన ప్రశ్న విని భర్త అంతసేపు మౌనంవహించేసరికి భర్త మనస్సుకి కష్టం కలిగిందని గ్రహించింది. తక్షణం సృజనకి కర్తవ్యం స్ఫురించింది.

"ఊరికే అన్నానండీ... సరిగ్గా భోంచెయ్యరేం?" అంటూ కూరా, పచ్చడీ మరికాస్త వడ్డించింది.

భర్త ఆఫీసుకి వెళ్లాక, పెద్ద పోస్టాఫీసుకి వెళ్లి "గతాన్ని తవ్వకు -" అని కేబుల్ పంపింది శేఖర్‌కి.

ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, 25-6-93